

# జీవితనాటకంలో విష్కంభం

-గోవిందరాజు సీతాదేవి

"నేనీఊళ్ళో ఉన్నాననీ, ఇది నా ఇల్లేననీ తెలుసుకుని కదూ నువ్వు వచ్చింది?"

"అవును."

"నాకు నీవెక్కడున్నావో తెలియదు అన్న మాట నిజం కదూ!"

"నిజం."

"మరి అలాంటప్పుడు నువ్వు నన్ను వెతుక్కుంటూ వచ్చావు. ఇందుకు చాలా సంతోషం. కానీ. . ."

"ఊఁ కానీ?"

"పరాసరి వచ్చి, 'ఒరే రామం!' అని వాటేసుకుని ఉక్కిరి బిక్కిరి చేయకుండా నన్ను గురించి నువ్వు ఈ పరిచయాలేమిటి? అని చచ్చేంత కోపం వచ్చేసింది. ఇందుకే కాస్సేపు ఏడిపించేశాను. ఇంకా ఏడిపించాలని మనస్సులో ఉబలాటంగా ఉన్నా నీ కళ్ళలో కదిలే ఊహాలు చదివాను. అవిచెప్పనా? 'పేదవాడిని— ఏదైనా సాయం కోరి వచ్చానని అనుకుని నన్ను గుర్తించి నాటకం ఆడి వెళ్ళగొట్టాలని చూస్తున్నాడని అపోహ పడటం గ్రహించాను. నీలో ఇలాంటి ఆలోచన పెరగటం అంత ఆరోగ్యప్రదం కాదు. కనక. . . ."

"కనక..."

"నేను నువ్వు వెతుక్కుంటూ వచ్చిన ఆ చిన్ననాటి ఫ్రెండ్‌నే అని ఒప్పేసుకున్నాను."

"ఎంతైనా పోలీస్ బుద్ధులు పోలేదురా!" రామచంద్రంగారు నవ్వేశారు.

ఇంక చిన్ననాటి కబుర్లు ప్రారంభమైనాయి. ఆనాడు నువ్వు అలా చేశావంటే నువ్విలా చేశావు మామా! అని గుర్తు చేసుకుంటూ ఇద్దరూ కాలాన్నే మరిచి పోయారు. తరవాత రామచంద్రంగారు తెప్పరిల్లి—"ఒరేయ్! కాఫీనా? టీయా" అని అడిగారు.

"రెండూ కాదు—హార్లిక్స్."

"ఓ.ఎస్. హార్లిక్స్ ఉంది. నాయర్! ఒక కప్పు హార్లిక్సూ, ఒక కప్పు టీ దానితో బాటు బిస్కెట్లూ పట్టుకురా!" కేక పెట్టారు రామచంద్రంగారు.

పది నిమిషాలు కాకుండానే అవి వచ్చేశాయి.

"చిన్నవాళ్ళలా ఈ బిస్కెట్లు ఏమిటిరా!"

కప్పూ సాసరూ అందుకుంటూనే మొగమాటంగా అంటూంటే రామచంద్రంగారు బిగ్గరగా నవ్వేశారు.

"వృద్ధులూ బాలురతో సమానం అన్నారు పెద్దలు. కనుక తినేసెయ్యి.

మన చిన్ననాటి కబుర్లు ఈ రోజుకి చాలు. ప్రస్తుతానికి వద్దాం. నువ్వు ఈ వూళ్ళోనే ఉన్నావా? ఎన్నాళ్ళ బట్టీ ఉన్నావు? ఎందరు పిల్లలు?"

"పిల్లలు నలుగురు. ముగ్గురమ్మాయిలూ, ఒక అబ్బాయీ. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళి చేశాను. అత్తవారి ఇళ్ళకు వెళ్ళారు. కొడుక్కి పెళ్ళి అయింది. వాడికీ ఈ వూళ్ళో ఉద్యోగం. అందుకే వాడి దగ్గరికి

వచ్చాం కొత్తగానే. ఇంక ఆఖరి ఆడపిల్ల పెళ్ళికి ఉంది. నేను బడిపంతులు చేసి రిటైర్ అయినానని నీకు తెలుసు. నా సంగతి ఇది. మరి, నీ భార్యా పిల్లలూ?"

"నాకు పిల్లలు కలగలేదు. ఈ దిగులుతోనే ఆమె స్వర్గాన్ని చేరుకుంది."

"అయ్యో, అలాగా! ఈ ఇల్లు చూస్తే ఇల్లాలు లేని ఇల్లులా లేదే?"

"అవును—అలా కనిపించదు."

"చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ పెంపుడు జంతువుల పోషణా, ఈ నౌకర్ల క్రమ శిక్షణా, పెరటితోట పెంపకమూ—ఇదంతా చూస్తుంటే ఈ ఇంటి ఇల్లాలు మా అందరి అవసరాలూ తీర్చి, ఇల్లు సర్దుకుని, సంధ్యాసమయం కావటంవల్ల అలా ఏ దేవాలయానికో వెళ్ళి ఉంటుంది అనిపిస్తుంది."

రామచంద్రంగారి కళ్ళలో నీళ్ళు తిరిగి, అవి అక్కడే ఆగిపోయాయి. పైకి నవ్వలేక నవ్వారు. మెల్లగా చేతిలోని కాఫీ కప్పు కింద పెట్టారు.

"శ్రీనూ! రా! ఇల్లు చూపిస్తాను."

ఇద్దరూ ఇల్లంతా తిరిగారు.

"చాలా బాగుంది. కానీ, నువ్వు ఒక్కడివీ ఇలా ఎలా సమర్థించ గలుగుతున్నావు? ఆశ్చర్యంగా ఉంది సుమా!"

"ఆశ్చర్యం ఏముంది? నేను తెలుగు సినిమాలో హీరోలా జీవితంలో, ముఖ్యంగా ఈ ఇంట్లో ద్విపాత్రాభినయం చేస్తున్నాను. ఆశ్చర్యపోకు. ద్విపాత్రాభినయం అంటే ఉదయం అంతా యజమానురాలిలా, సాయంత్రాల్లో యజమానిలా— ఇంతే. ఈ ఇల్లు ఇంకా ఇంకా బాగా ఉంచుకోవచ్చు. కానీ, నా కింక శ్రద్ధ లేదు" అంటూ నిర్లిప్తంగా నవ్వారు రామచంద్రంగారు.

"సరే...సరేకానీ, ఒంటరిగాడివి నీ కీ ఇల్లూ, నౌకర్లూ చాలక ఆ పెంపుడు జంతువుల పెంపకం కూడా ఎందుకురా?"

"మనిషిలో ఉండే వంచన, అసూయ, ద్వేషం లాంటి గుణాలు వాటిలో లేనందువల్ల, అవంటే నాకు చాలా ఇష్టం."

"అంటే, ఇంత పెద్ద పోలీస్ ఆఫీసర్ని కూడా భరతం పట్టించిన వాళ్ళు ఉన్నారన్న మాట."

"నీలా నేనూ బడిపంతులినైనా కాకపోతినే అని చాలా సార్లు విచారించిన రోజులు ఉన్నాయి."

"నీలా పోలీస్ ఆఫీసర్ కాలేకపోతినే అని బాధ పడిన రోజులు నాకూ ఉన్నాయి."

"అదే విచిత్రం. మనకు ఉన్నది కాక, మరొకరు అనుభవించేదే మంచిదై ఉండవచ్చుననీ, అది లభ్యమైతే బాగుండి ఉండేదనీ ప్రతి మనిషి తన జీవితంలో కొన్ని సార్లు అనుకుంటూనే ఉంటాడంటావా, శ్రీనూ?"

"నిజం! నిజంగా నిజం. అవన్నీ సరేగానీ, నీ సిప్పీ బాగుంది సుమా! ఇదంటే నీకు ఆరవ ప్రాణంలా ఉంది కదూ!?"

"అవును."

"నాకు చాలా అసూయగా ఉంది — సిప్పీ అదృష్టానికి."

రామచంద్రంగారు తేలికగా నవ్వేశారు.

"చాలాసేపైంది వచ్చి. అప్పుడప్పుడూ వస్తూ ఉంటానులే."

లేచారు శ్రీనివాసరావుగారు. రామచంద్రంగారు గేటువరకూ వచ్చి సాగనంపుతూ, "శ్రీనూ! నేను ఒంటరిగాడిని. నీకు వీలున్నంతవరకూ ఎక్కువగా వస్తావు కదూ?" అన్నారు.

"నువ్వు ఎవరు అనవుకదూ?"

"అడగను, శ్రీనూ! నేనే కాదు, ఈ ప్రపంచంలో బాల్య స్మృతులనీ, ఆ నాటి స్నేహితులనీ ఎవరూ మరిచిపోరురా! ఆఫీసరైనా, గుమాస్తా అయినా, ధనికుడైనా, పేదవాడైనా ఈ జ్ఞాపకాలను హృదయంలో భద్రంగా దాచుకుంటాడు. మనిషి ఎంతగా మారినా, ఈ ఒక్క విషయంలో మాత్రం మారడు అని నా నమ్మకం. ఏమంటావు?"

"సెంట్ పెర్సెంట్ కరెక్ట్ అంటాను. వస్తానులే మళ్ళీ."


నవసాహితి వారి నూతన ప్రచురణలు
—అగ్రశ్రేణి నవలా రచయిత్రుల రచనలు



మాదిరెడ్డి సులోచన

| | |
|---|---|
| ప్రేమ పంజరం (ఆంధ్రజ్యోతి సీరియల్) | 12.00 |
| రాగమయి | 10.00 |
| అందని పిలుపు | 10.00 |
| కలకాదు సుమా! | 10.00 |

(పై 3 నవలలు సీరియల్‌గా కాక డైరెక్టుగా వెలువడినవి)

పోల్కంపల్లి శాంతాదేవి

| | |
|---|---|
| పుష్యమి (ఆంధ్రభూమి సీరియల్) | 12.50 |
| సంగమం (డైరెక్టు నవల) | 10.00 |
| ఆఖరి వీడ్కోలు (యువ సీరియల్) | 9.00 |
| నౌకాగమనం (డైరెక్టు నవల) | 10.00 |

ఏ పుస్తకం కావలసినా 1 రూపాయి తగ్గించి M.O. చేయండి. ఆ రూపాయికి V.P. లో పంపగలము.

నవసాహితి బుక్ హౌస్, ఏలూరురోడ్, విజయవాడ - 520002

శ్రీనివాసరావు మెల్లగా నడుస్తూ వెళ్ళిపోయారు. రామచంద్రంగారు అలా అక్కడే నిలుచుని ఉండిపోయి అనుకున్నారు:

'ఎంత హుషారుగా ఉండేవాడు! ఎంత తెలివిగా ఉండేవాడు! అవన్నీ ఏమైపోయాయి? మనిషి కీ దశలు ఏమిటి?'

ఆలోచిస్తూ లోపలికి వచ్చారు. వాలు కుర్చీలో వాలిపోయారు. గోడకు వేలాడుతూన్న భార్య ఫోటో లోకి చూస్తూ, అనుకున్నారు:

'రాజ్యం! శ్రీను అనుకుంటున్నాడు — నేను అదృష్టవంతుడినని. ఇల్లూ, వాకిలీ, నౌకర్లూ చాకర్లూ ఉన్నారు కనక శాంతిగా బ్రతుకుతున్నానని. కానీ, ఇది అబద్ధం. శ్రీనివాసే అదృష్టవంతుడు నా ఉద్దేశంలో. ఎలా అంటే, ఆర్థిక పరిస్థితులు ఎంత బాగా లేకున్నా, గుండె దిటవు పోగొట్టుకోకుండా పరిస్థితులకు రొమ్ము ఎదురొడ్డి నిలబడేందుకు వాడికి మనసులో మనసైన సహచరి ఉంది. ఇదే వాడికి బోలెడంత శక్తి నిస్తుంది. శాంతి నిస్తుంది. కార్యోన్ముఖుడిని చేస్తుంది. ఈ అదృష్టాన్ని వాడు గుర్తించినట్లు లేదు. ఇదింతే. మనిషి స్వభావం ఏమిటో కానీ, తనకున్న అదృష్టాన్ని గుర్తించ లేడు. విచిత్రం కదూ?'

ఇలా ఆయన ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. గోడమీద గడియారం టిక్కుటిక్కుమంటూ తన విధి నిర్వహణ చేస్తూనే ఉంది.

నాలుగు రోజులు గడిచిపోయాయి.

స్నేహితుడికోసం రామచంద్రంగారు ఎదురుచూసి చూసి విసిగిపోయారు. 'వాడి ఇంటి అడ్రస్ అయినా తీసుకుని ఉంటే బాగుండేది. నేనే వెళ్ళి వచ్చేవాడిని. తెలివిలేనివాడ్నైనాను.'

తనమీద తనే విసుక్కుంటూ గడిపారు.

2

అయిదవ రోజున శ్రీనివాస రావు రానే వచ్చారు.

"న ... మ ... స్తే" అంటూన్న చిల్చిని పలక రించి, తోక ఆడిస్తూ దగ్గరికి వచ్చిన పెంపుడు కుక్కను తల దువ్వాడు.

"నమస్తే." చిల్చి పంజరంలో గిరగిరా తిరుగుతూ చిలక పలుకులు పలుకుతూంది. ఈ పలుకులకు ముచ్చట వేస్తున్నా, ఆయన దృష్టి పంజరంలో ఉంచిన రెండు దోర పండిన జామకాయల మీదే ఉంది. అవి చూస్తున్న కొద్దీ నోరూరి పోతూ ఉంది.

'ఈ డబ్బున్న వాళ్ళకు బుద్ధి లేదు. సాటి మను షులు తిండికీ, గుడ్డకూ ముఖం వాచి వస్తుంటే ఏడుస్తూంటే, ఈ చిలకలనూ, కుక్కలనూ తెగ మేపుతూ ఉంటారు' అని రెండు క్షణాలు ఆలోచించి, ఇటూ, అటూ చూసి తోటమాలి ఎక్కడా లేడని ధైర్యం తెచ్చుకుని రెండు జామకాయలూ తీసి చేతి సంచీలో వేసేసుకుంటూ ఉండగా చిల్చి చప్పున పంజరంలోనించి తప్పించుకుని రివ్వున ఎగిరిపోయింది.

భయంతో శ్రీనివాసరావుగారికి ఒళ్ళంతా చెమటలు పట్టేసింది.

'భగవాన్! రామం వస్తే?' అనుకుంటూ పంజరం దగ్గర నుంచి దూరంగా రావాలని ప్రయ త్నించారు. కానీ, కాళ్ళు ఆయన మాట వినడంలేదు.


## తాజా వార్తలకు
# ఆంధ్రప్రభ దిన పత్రిక

చేసుకొని మరీ పెట్టుబడి పెట్టండి.



మీరు శాన్క్యోనే ఎంచుకోవాలనుటకు గల 9 మంచి కారణాలు.

Sankyo



★ ఉజ్వల కాంతి—దీపావళా ... పెట్టి పెట్టగానే బల్బ్ వెలిగిపోతుంది.
★ దీర్ఘకాల మన్నిక—జీవితాంతం ... మన్నుతుంది.
★ ... బ్యాటరీ బాగోగులకు లేదా ... ఖర్చే వుండదు.
★ ఏటికి ఎదురీది వెలుగుతుంది—అన్ని కాలాల్లోను మంచి కాంతివంతంగా వుంటుంది.
★ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం—జపాన్‌వారి సహయోగంతో అత్యంత అధునాతనమైన ప్లాంట్‌లో తయారు చేస్తారు.
★ నాణ్యత గార్యంటీ—నాణ్యత ఖచ్చితంగా వుండాలని అంచలవారీగా పరీక్ష చేస్తారు.
★ అంతర్జాతీయ ఆమోదం వుంది—ప్రపంచమంతటా ఎగుమతి చేస్తున్నారు.
★ అందరి అభిరుచికి తగ్గ మోడల్స్—12 ఓల్టులు అండ్ 6 ఓల్టులు రెండు బల్బులు లేదా ఒకే బల్బుండి రకరకాల డిజైన్లున్నాయి.
★ మార్కెటింగ్—భారత దేశమంతటా రెడీగా దొరుకుతున్నాయి.

భారత దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న
**12 ఓల్టుల శాన్క్యో డైనమో లైట్**

ఉత్పత్తి చేయువారు :

IJI ఇండో-జపనీస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, కలకత్తా

మార్కెట్ చేయువారు : నిగమ్ బ్రదర్స్. కలకత్తా-700 013

మా బ్రాంచీలు : బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, కాన్పూర్, మరియు విజయవాడ

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ________
విలాసము: ________
________ PIN ________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14-
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ —



ఎళ్లు వస్తున్నప్పుడు
అతనికి ఇది తోడ్పడుతుంది...



నౌనిహాల్
గ్రైప్ సిరప్
నౌనిహాల్ గ్రైప్ సిరప్‌ను పళ్లు వస్తున్న పాపల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఆ కష్ట కాలంలో మీ పాప తట్టుకునేందుకు నౌనిహాల్ దోహద పడుతుంది.
అది చిగుళ్ల నొప్పిని, కడుపు నొప్పిని అరికడుతుంది. జీర్ణ శక్తిని వృద్ధిచేస్తుంది. మలబద్ధకాన్ని, అతి విరేచనాలను కూడ అరికట్టి, ఆకలి పుట్టిస్తుంది.

Kamdaar

AID-4973 TEL



నౌనిహాల్
బేబీ టానిక్
మీ బిడ్డ పెరుగుతున్నకొద్దీ, అన్ని విధాల అతని ఆరోగ్యానికి, ఇది టానిక్! మామూలు ఆహారంలో లేని ముఖ్య పోషక పదార్థాలు విటమిన్లు ఎ,డి,సి మరియు బి కాంప్లెక్సు, ఇంకా 4 ఖనిజ లవణాలు, నౌనిహాల్ బేబీ టానిక్‌లో ఉన్నాయి.
మీ పాప బలంగా, దృఢంగా పెరిగేందుకు, ... చురుకుగా ఉండేందుకు ఇవన్నీ తేలికగా జీర్ణమయ్యే రూపంలో ఉన్నాయి.

బిడ్డ బలంగా పెరగటానికి ఇది తోడ్పడుతుంది!


"హల్లో, శ్రీనూ! ఇన్నాళ్ళూ రాలేదేంరా! నీ కోసం ఎంత ఎదురు చూశానో తెలుసునా? అరె! అలా అయిపోతూ ఉందేం ముఖం ... ఏమైం దేమిరా!"

"అహా. ఏం లేదు. నువ్వు ... షికారుకి వెళ్ళలేదూ?"

"వెళ్ళాను. వచ్చాను. ఏం?"

"అబ్బే, ఏం లేదు ... ఇప్పుడే వచ్చావా?"

"కాదు ... చాలా సేపయింది."

"ఆఁ!" వెన్నులోనించి వస్తూన్న వణుకును అణచుకుంటూ అక్కడే ఉన్న కుర్చీలో కూలబడ్డారు.

"ఇక్కడే కూర్చుందామా? సరే! నౌకర్ని టీ ఇక్కడికే తెమ్మంటాను" అంటూ పంజరం వైపు చూసి, చప్పున లేచి—"నా సిప్పీ ఏదీ? ఈ తలుపు ఎవరు తీశారు? రాస్కెల్! నే ప్రేమగా పెట్టినవన్నీ తిని, చిలక పలుకులు పలికి నన్ను మురిపిస్తూ, సమయం దొరకగానే పంజరంలోనించి పారిపోతుందా! దీనికి మనుషుల మధ్య మసిలే సరికి వీళ్ళ బుద్ధులు వస్తున్నట్టున్నాయి. అయినా, ఎక్కడికి పోతుంది? నేను పోలీసు ఆఫీసర్ని. చూస్తాను దీని సంగతి. ఆఁ, శ్రీనూ! అసలెక్కడి నుంచి వస్తున్నావు? చేతిలో ఆ సంచీ ఏమిటిరా! కుచేలుడు అటుకులు తెచ్చినట్టు నాకోసం ఏమైనా పిండివంటలు చేసి ఇచ్చిందా నీ శ్రీమతి? త్వరగా చూపించు" అంటూ మిత్రుడి చేతిలోని సంచీ లాక్కుని ఆత్రతగా చూశాడు. "అరె! జామకాయలు! మా సిప్పీకి ఇష్టమని తెచ్చావా? నాకు తెలుసు—మా సిప్పీ అంటే నీకు చాలా ఇష్టం అని. ఉండు. దీన్ని చూపిస్తూ పిలుస్తాను. 'సిప్పీ! కమాన్ ... కమాన్! నీ కోసం శ్రీను జామకాయ తెచ్చాడోచ్!"

ఎక్కడ ఉందోకాని రామచంద్రంగారి పిలుపు వినీ వినగానే రివ్వున వచ్చి, ఆయన భుజం మీద వాలింది. దాన్ని ప్రేమగా నిమురుతూ, పంజరంలో ఉంచి, జామకాయలు లోపలఉంచి తలుపు మూస్తూ అన్నారు:

"శ్రీనూ! చూశావుగా? ఇది మనిషి కాదు కనక తిండికే ఆశపడి ఈ పంజరం బ్రతుక్కి ఇష్టపడి వచ్చేసింది కదూ?"

శ్రీనివాసరావుగారు మిత్రుడినీ, చిలకనూ మార్చి మార్చి చూస్తూ ఈ మాటకు ఉలిక్కిపడి "ఆఁ... ఆఁ..." అంటూ తత్తరపడి—అంతలోనే తనను తను సంబాళించుకున్నారు.

"రామం! వెళ్ళి వస్తా! మరొకసారి వస్తా" అంటూ వెళ్ళిపోతూ ఉంటే రామచంద్రంగారు మిత్రుడి చేతిని గట్టిగా పట్టుకున్నారు.

"టీ తాగాలి. తరవాత నాకు ఒక విషయంలో సాయపడాలి. నా పెంపుడు కొడుక్కిగాను పెళ్ళి కూతుళ్ళను వెతుక్కుంటున్నాను. కొన్ని ఫోటోలు వచ్చాయి. వాటిలో ఉన్న అమ్మాయిలను చూడాలి. నీ అభిప్రాయం చెప్పాలి."

"ఏమిటీ! నీకు పెళ్ళీడు కొడుకు ఉన్నాడా? మొన్న చెప్పలేదేం?"

"స్వంత కొడుకు లేడన్నాను. అంతే. ఈ కొడ్కిక్కి కూడా గమ్మత్తుగా నాకు ప్రాప్తించాడు. ఎక్క.

ఎస్‌సి. పాస్ అయి మిలిటరీలో చేరాడు. కాప్టెన్ అయాడు.''

''ఆ—అలాగా? స్వంతం కాదు అంటే?''

''ఇప్పుడా వివరాలన్నీ చెప్పలేను. అవసరం వచ్చి నప్పుడు తప్పకుండా చెబుతాను కానీ, లోపలికి రా.''

లోపలికి తీసుకువెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టి, క్షమాపణ తప్పించుకుని తన గదిలోకి వెళ్ళారు రామ చంద్రంగారు.

'వీడు నా...నా...పని చూసే ఇలా వాతపెట్టినట్లా లేక...ఏమో! ఆ పోలీస్ ఆఫీసర్ వెధవ! దొంగతనం చేయటం చాలా కష్టం అని చాలా మందికి తెలియదు. జీవితం అంతా మంచి బతుకు బతికి ఈ రోజు. ఈ రోజిలా నేను ఎందుకు చేశాను? ఛీఛీ! ఎంత సిగ్గు! భగవాన్! నాకు ఈ తప్పుకి ఏదో ఒక శిక్ష వెయ్యి. అలా వేస్తే కానీ నా మనస్సుకు శాంతి ఉండదు.'

శ్రీనివాసరావుగారు పశ్చాత్తాపంతో కుమిలిపో సాగారు.

రామచంద్రంగారు ఒక పది ఫోటోలు తీసుకు వచ్చి ఒక్కొక్కటి చూపిస్తూ, ఆ అమ్మాయిల వివరాలు చెప్పసాగారు. శ్రీనివాసరావుగారికి ఈమాటలు ఏవీ బుర్రలోకి ఎక్కడం లేదు. అయినా, చూస్తూన్నట్లు నటిస్తూ, ''రామం! నీకు కోడలు కావలసిన అమ్మాయికి అర్హతలు ఏం ఉండాలి?'' అని అడిగారు.

''నీకూ ఒక అల్లుడు కావాలి కదా? అతనికి ఎలాంటి అర్హతలు ఉండాలి?''

''అబ్బబ్బ! అన్నీ ఎదురు ప్రశ్నలే! ఒక్క ప్రశ్నకూ సూటిగా జవాబు చెప్పవు కదా!''

''నువ్వూ డిటో యేగా!'' నవ్వుతూ స్నేహితుడి ముఖంలోకి చూశారు.

''చెపుతాను, విను! నా కోడలు గేమ్స్‌లో ప్రవీణు రాలై ఉండాలి. అందంగా ఉండాలి. బుద్ధిమంతు రాలై ఉండాలి.''

''ఇంకా?''

''ఇంకేం అక్కరలేదు.''

''కట్నం. . .''

''అక్కరలేదు.''

''నిజంగా?''

''నిజంగా?''

''నువ్వు సెలెక్టు చేసిన అమ్మాయిని నీ కొడుకు పెళ్ళాడతాడా?''

''ఓ ఎస్! ఈ విషయంలో నిర్ణయం నాకే వదిలేశాడు! ఈమాటలు సరేకానీ, ఈ అమ్మాయిల్లో ఎవరు బాగున్నారు?''

''ఎవ్వరూ బాగాలేరు.''

''నిజంగా?''

''వూఁ! నిజంగా.''

''ఎమ్. ఎ. లూ, ఎమ్. ఎస్‌సి. లూ, బాంకులో ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళూ ఒక మాదిరిగా బాగానే ఉన్నట్టున్నారు. నీ కెందుకు నచ్చలేదు?''

''ఇంతకంటె అందమైన, బుద్ధిమంతులైన అమ్మాయిలు ఉన్నారు.''

''నిజం? అయితే, వెంటనే చూపించు.''

''అలాగే. వాళ్ళతో మాట్లాడి వచ్చి చెపుతాను. సరేనా?''

''సరే. కానీ, త్వరగా కావాలి. మా అబ్బాయి వారం రోజుల్లో ఢిల్లీ నుంచి వస్తున్నాడు. పది హేను రోజులే సెలవు ఉంది.''

''చాలు'' అంటూ వెళ్ళిపోయిన శ్రీనివాసరావు మరురోజే తిరిగి వచ్చారు.

''ఒక లాయరు కూతురు ఉంది. వీణ బాగా వాయిస్తుంది'' అన్నారు.

''నాకు కావలసింది సంగీతం కాదు. గేమ్స్.''

''అలాంటి అమ్మాయీ ఉంది. వెడదాం, పద.''

వాళ్ళకు మా వివరాలన్నీ చెప్పావా? చూడూ, ఏదీ దాచవద్దు.''

''చెప్పాను. ఎందుకైనా మంచిది. మీ అబ్బాయి ఫోటో కూడా వెంట తీసుకురా.''

''సరే కానీ, ఈ అమ్మాయి తలిదండ్రులూ వగైరా వివరాలు చెప్పలేదు. ఈ పిల్ల వివరాలు చెప్పలేదు.''

''అన్నీ చెప్పుతాను. అయినా, మీ అబ్బాయికి కావలసిన అర్హతలు ఉన్న అమ్మాయిలనే చూపిస్తా నని చెప్పానా?''

''అవును. కనీసం పిల్ల పేరన్నా చెప్పరా?''

''స్వర్ణ.''

''గుడ్! పేరు చాలా బాగుంది. పద.''

ఇద్దరూ బయలుదేరారు.

ఒక రెండు గదులు ఉన్న చిన్న ఇల్లు ముందు గదిలో వేసి ఉంచిన కుర్చీలో కూర్చోబెట్టారు. కాఫీ వచ్చింది. ఇద్దరూ తాగారు.

''త్వరగా పిలిపించు.''

''వస్తూంది'' అంటూ ఉండగానే ఒక పాతికేళ్ళ అమ్మాయి లోపలి గదిలో నించి వచ్చింది. తెల్లగా, ఆరోగ్యంగా, అందంగా, పొడుగ్గా ఉంది. వాయిల్ చీరా, జాకెట్టూ, బారెడు జడా, పెద్ద కళ్ళూ— చూడగానే అందమైన పిల్ల అనిపించింది రామచంద్రం గారికి.

చదువూ వగైరా అడిగారు. అన్ని ప్రశ్నలకూ జవాబిచ్చింది.

''సంగీతం వచ్చా?''

''రాదు.''

''ఏ సంవత్సరంలో బాస్కెట్‌బాల్ టోర్న మెంట్‌కు వెళ్ళావు?''

ఆ అమ్మాయి అర్థం కానట్లు చూసింది.

శ్రీనివాసరావుగారు టకటకా ఏవో చెప్పేస్తున్నారు. గొంతు తగ్గించి, ''అసలు పిల్ల నచ్చిందా? అది నచ్చితే కదూ మిగతా వివరాలు?'' అనేసి తన చేతి లోని ఫోటో ఆ అమ్మాయికి ఇచ్చి—''రెండు రోజుల తరవాత వస్తాం'' అన్నారు, లోపలి సగం కనిపిస్తూ, సగం ఒదిగి నిలుచున్న తల్లితో.

''ఇంకా ఎంత సేపు చూస్తావు?'' అంటూ మిత్రుడిని చేయి పట్టుకుని లేవదీశారు.

ఇద్దరూ బయటికి వచ్చారు. ఆటో ఎక్కి ఇల్లు చేరారు.

''ఇంతకూ ఆ పిల్ల తండ్రి ఎక్కడ?'' నిలదీసి అడిగారు రామచంద్రం గారు.

''వస్తాడు కానీ, ఇంతకూ పిల్ల నచ్చిందా?''

''ముందు మా వాడు ఆ పిల్లకు నచ్చాడో లేదో తెలుసుకుని రా! అంతవరకూ ఒక్క మాట మాట్లాడను.''


## స్వయం ఉపాధి

ఫోటోగ్రఫీ మరియు స్క్రీన్ ప్రింటింగు పనులను పోస్టు ద్వారా నేర్చుకొని సులభముగా పనిచేసి సంపాదించ వచ్చును. అన్ని రహస్యములు ఇంగ్లీషు, హిందీ మరియు తమిళ భాషలలో నేర్ప బడును. ప్రాస్పెక్టసు కొరకు వ్రాయండి.

**KALAI MATHI NILAYAM (A)**
Nanjai Thalaiyur - 639 204
TAMILNADU

బ్రహ్మాండమైన పద్ధతిలో....
లోక ప్రసిద్ధి చెందిన....
''అలోపతి''

**LABORATORY TEST**

పరీక్షలు డిసెంబరు నెలలో జరుపబడును.
దీనికి ఫీజు రూ. 200/— మాత్రమే !
నేడే వ్రాయండి.

**A M T C (Regd)**
76, N. V. St., MADRAS-600021
Phone:- 553958.

— KATHANJALI.




## పెండ్లికి ముందు, తర్వాత !

నరముల బలహీనత, శుక్లనష్టము, శీఘ్ర స్కలనము, ఇతర సెక్స్ సమస్యలకు, చర్మ వ్యాధులకు (ఏ రకమైననూ), ఇస్నోఫీలియా, దమ్ము, ఆయాసము, ఉబ్బసము, అజీర్ణ వ్యాధులకు ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా ఔషధములు పంప బడును. వివరాలకు 50 పై.లు స్టాంపులు పంపండి.

**బాబా అండ్ కో ఆస్పత్రి,**
తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ-3

సినీ రంగ విశేషాలకు
# స్క్రీన్ చదవండి
సుప్రసిద్ధ సినీ వార పత్రిక



పండుగలకు ప్రత్యేక తగ్గింపు

10% ప్రత్యేక రిబేటు 6-10-80 నుంచి



ఎంపికచేసి తెప్పించిన సిల్కు, కాటన్, తదితర వస్త్రాలను పండుగలకోసం కొనదలచినప్పుడు మావద్ద చూడండి.

హేండ్‌లూం హౌస్
(పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడినది)
మావాని పోమప్ప భవన్, గాంధీభవన్ ప్రక్కన నాంపల్లి, హైదరాబాద్-1. ఫోన్ :50252
షోరూము పనివేళలు : ఉ. 10 నుంచి రాత్రి 8 గంటల వరకు.
ఆదివారాలు, నవంబరు 1 వ తేదీ శెలవు. డైనర్స్ క్లబ్ కార్డులు మేము తీసుకుంటాము.
ASSOCIATED/HH/272A/T

కావేరి
సైకిల్ టైర్లు-ట్యూబులు
మరియు రిక్షా టైర్లు
అత్యుత్తమమైనవి!
మన్నిక గలవి!!
సున్నితమైన పనితనానికి,
మృదువైన స్వారీకి
మరో పేరు!!!




మీ సమీపంలోవున్న
డీలరు నుండి
పొందండి!
సేల్స్ డిపో:
కావేరి రబ్బర్స్
11-5-3 రంగన్నవారివీధి, విజయవాడ-1.
SUVARNA

శ్రీనివాసరావు వెళ్ళిపోయారు. సాయంకాలమే వచ్చి చెప్పారు.

"మీ వాడు ఆ పిల్లకు నచ్చాడట."

"అయితే, ఆ పిల్ల తండ్రిని తీసుకుని రా!"

"ముందు చెప్పకూడదూ?"

"ఉహూఁ! ఆయనకే చెపుతాను."

శ్రీనివాసరావు కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయారు. వెళ్ళిపోతున్న మిత్రుడిని అలా చూస్తూ తీవ్రంగా ఆలోచించ సాగారు. శ్రీనివాసరావు మళ్ళీ వచ్చారు. ఆ పిల్ల తండ్రికి ఆరోగ్యం బాగా లేదనీ, విషయం తెలుసుకు రమ్మన్నారనీ చెప్పారు.

శ్రీనివాసరావు కళ్ళు వాల్చేశారు.

"రామూ! అవును, కాదు అని చెప్పటాని కింత ఆలోచనా?"

"ఆ పిల్ల తండ్రిది చాలా వీక్ గుండె! 'అవును' అన్న మాట చెపితే వినగానే ఆ గుండె ఆగిపోతే?"

శ్రీనివాసరావు ముఖంలో సంతోషపు ఛాయలు చూస్తూ, "ఏమిటేరా! నీ కీ వార్త అంత సంతోషాన్ని కలిగిస్తూందా! విచిత్రంగా ఉందే!" అన్నారు.

శ్రీనివాసరావుగారు ఉబికివచ్చే సంతోషాన్ని అణుచుకుంటూ, "వెళ్ళి వస్తారా, రామం. ఈ సంతోష వార్త వాళ్ళకు ఇప్పుడే అందిస్తాను" అన్నారు.

"ఆ వార్తతోబాటు నే నీ రోజు సాయంకాలం వారి ఇంటికి వస్తున్నానని కూడా చెప్పు."

"ఆఁ... నువ్వు వెడతావా? ఎందుకూ?"

"ఎందు కేమిటి? అదంతే" అంటూ పేపరు చదువుకోవటంలో మునిగిపోయారు.

శ్రీనివాసరావు మెల్లగా వెడుతూంటే, సిప్పీ పలకరిస్తూంది.

"న ... మ ... స్తే."

"ఆఁ. నమస్తే" నీరసంగా జవాబిచ్చి వెళ్ళిపోయే మిత్రుడివైపు చూస్తూ పేపరు మడిచి టేబిలు మీద పడేశారు రామచంద్రంగారు.

## 3

సాయంకాలం అయిదు గంట లయింది. శ్రీనివాసరావుగారి ఇంట్లో అలజడిగా ఉంది. స్వర్ణ దిగాలుగా కూర్చుని ఉంది. తల్లి కూతుర్ని తిట్టిపోస్తూ ఉంది. అన్నగారు ఇల్లంతా కలయ తిరుగుతున్నారు. వదినగారు బిక్కముఖం వేసుకుని చూస్తూ ఉంది. తల్లి మళ్ళీ తిట్ల వర్షం ప్రారంభించింది.

"సిరి రా మోకాలు అడ్డడం ఏమిటే? మీ నాన్న ఎంతో కష్టపడి ఎన్నో సంబంధాలు వెతికీ వెతికీ విసిగిపోయినా, ఏదో అదృష్టవశాత్తూ ఆ పాత స్నేహం పైకి వచ్చి అందగాడూ, ఉద్యోగస్థుడూ నిన్ను పెళ్ళడటానికి ఒప్పుకుంటే వద్దు, వద్దు అనటం నీకు పోయేకాలం రావటం కాదూ?"

"అవన్నీ చెప్పకమ్మా! నాన్న నాకు గేప్పు వచ్చునీ, ప్రైజులు బోలె డున్నాయనీ అబద్ధాలు ఎందుకు చెప్పాలి?"

"నీ సుఖం కోసం, నీ భవిష్యత్తుకోసం ఒకే ఒక చిన్న అబద్ధం ఆడారు. ఆడితే తప్పా? వెయ్యి అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్ళి చేయవచ్చు."

"ఇదంతా మీ కాలంలో. ఈ కాలంలో మా యువతరం ఇలాంటివి భరించం."

"అంటే, ఇదంతా అబద్ధం అని చెప్పేస్తా నంటావు!"

"చెప్పేస్తాను."

"నాన్న పరువు ఏం గాను?"

"ఇప్పుడు కప్పి పుచ్చితే పెళ్ళి అయిన తరవాత నా పరువేం గాను, అమ్మా? వాళ్ళ మంచితనానికి ప్రతిఫలం మోసగించటమా, అమ్మా? అమ్మా! పెళ్ళంటే ఇలా అబద్ధాలతో ప్రారంభం కాకూడదు. నూరేళ్ళు కలిసి బ్రతకవలసిన అవసరం లేదూ?"

"నీ బొంద! ఇలా చేస్తే నీ కీ జన్మకి పెళ్ళి కాదు."

"కాకున్నా ఫరవాలేదు."

స్వర్ణ దగ్గరగా వెళ్ళి ఆవేశంలో చాచి చెంప పగల గొట్టింది తల్లి. స్వర్ణ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఒక వైపు దీని మొండితనం మార్చే శక్తి లేక, మరొక వైపు స్నేహితుడి ముందు పరువు పోగొట్టుకోలేక ఆయన ఏమై పోయూరో, నాయనా!" ఆవిడ కన్నీళ్ళు తుడుచుకో సాగింది.

తను అన్న ప్రకారం స్నేహితుడి ఇంటికి బయలు దేరి ముందు గదిలోకి అడుగు పెట్టబోతూ, లోపలి నించి బిగ్గరగా మాటలు వినిపిస్తూంటే, వాటిని వింటూ ఆగిపోయూరు రామచంద్రంగారు. అలా ఆగిన రామచంద్రంగారిని ఎవ్వరూ చూడలేదు. అంతా విన్న ఆయన లోపలికి రాబోయి, క్షణం ఆలోచించి గబుక్కున వెనక్కు తిరిగి రోడ్డు మీదికి వచ్చేశారు.

'వీడు ఏమై నట్టు? ఏ రైలు కిందన్నా తల పెట్టలేదు కదా? ఏ గన్నేరు పప్పన్నా చితక కొడుతూ మింగలేదు కదా? వీడి కోసం ఎక్కడని వెతకటం?'

దీర్ఘంగా ఆలోచిస్తూ ఆటోని పిలిచి ఎక్కి కూర్చున్నారు.

"ఎక్కడికి?" అడిగాడు ఆటో డ్రైవర్.

"రైల్వే స్టేషనుకి." అటుగా పరుగెత్త సాగింది ఆటో.

'అన్నట్లు వీడు బడీవంతులు కదూ! వూ... అయితే, మరి' అనుకుంటూ క్షణం ఆలోచించి, 'నా అంచనా ఈ సారి తప్పకూడదు మరి' అనుకుని ఆటోడ్రైవర్‌కి ఇంటి అడ్రెస్ చెప్పారు.

డ్రైవర్ వినుగ్గా ముఖం పెట్టాడు. రామ చంద్రంగారిని ఎగా దిగా చూసి ఆటోని వెనక్కు తిప్పాడు. రామచంద్రంగారు ఇల్లు చేరి, ఆటో దిగి లోపలికి వస్తూ ఉండగానే స్నేహితుడి చెప్పు గోడుగు కనిపించింది. 'అమ్మయ్య. నా అంచనా కరెక్ట్' అను కుని హుషారుగా లోపలికి వచ్చారు.

"హలో, శ్రీనూ! ఎంత సేపైంది వచ్చి? ఏదీ పెళ్ళి కూతురు తండ్రి?"

శ్రీనివాసరావు తల ఎత్తలేదు. ఉబికి వచ్చే కన్నీటిని ఆణచుకుంటూ అంతా చెప్పేశారు. ఆఖరున అన్నారు:

"రామూ! నువ్వీ వూళ్ళో ఉన్నావని తెలిసినప్పుడూ, నీ కోసం వెతుక్కుంటూ వచ్చి నప్పుడూ నా మనసులో కాస్తకూడా స్వార్థం లేదు. నీ ఇల్లు చూసి, నీ పరిస్థితి చూసిన తరవాత అనుకున్నాను—నా పిల్లకు పెళ్ళి కుదుర్చుకుంటే కాస్త డబ్బు సాయం చేయమని అడగాలని, నే నిలా అడిగితే నువ్వు కాదనవని. అయితే, నీ కో కొడుకున్నాడనీ, అతను పెద్ద ఉద్యోగం చేస్తున్నాడనీ, పెళ్ళి ఈడు వాడనీ, అతని కోసం పిల్లని చూస్తున్నావనీ తెలిసినప్పుడుకూడా నే నేం ఆశ పడలేదు. కానీ, నీ నన్న ఒకే ఒక్క మాట—కట్నం లేకుండా ( పిల్ల నచ్చితే ) చేసుకుంటా నన్న ఈ ఒక్క మాట నన్ను ప్రలోభంలోకి తోసింది. ఆశ పెంచింది. ఈ ఆశ నాలో స్వార్థం పెంచి, అబద్ధా లాడించింది. అయితే, నా కూతురు నిజాయితీ ముందు సిగ్గు పడి తల వంచుకుని పారిపోయి వచ్చాను. రామూ! నా స్వర్ణ ఒకే ఒక్క మాట అంది. అదేమిటంటే 'నాన్నా! మనిషికి ఆశ ఉండాలి. అదే జీవం పోస్తుంది. కానీ, నాన్నా, ఆశను దురాశగా మార్చకూడదు. మన ఆశతో ఆ మంచి హృదయాలను మోసగిద్దామా, నాన్నా?' అంది. 'యథార్థం వారికి చెప్పగలిగిన ధైర్యం ఉంటే చెప్పు. లేకుంటే ఈ పెళ్ళి కాకున్నా నే బాధ పడను. మీరు బాధ పడకండి, నాన్నా' అందిరా, రామూ! నా స్వర్ణ నిర్ణయానికి నేను ఆ క్షణంలో కోపగించుకున్నాను కానీ, మరు క్షణం లోనే గర్వపడ్డాను. నన్ను ఇప్పుడు ఒకే ఒక్క బాధ పీకుతూంది. నీ మంచితనం ముందు నేను ఓడి పోయూను. యథార్థం అంతా చెప్పి నీ క్షమాపణ కోరుతున్నాను. క్షమించా నన్న ఒక్క మాట అను. ఈ జన్మలో మరొక సారి నా ముఖం నీకు చూపను."

రామచంద్రంగారు మిత్రుడి ముఖంలోకి తదే కంగా చూడసాగారు. శ్రీనివాసరావుగారు వెళ్ళిపో బోతూంటే చప్పున చేయి పట్టి ఆపారు.

"శ్రీనూ! స్వర్ణ నీ కూతురని మొదటి రోజే గుర్తించాను. ఆ పిల్ల నాకు నచ్చింది కనక ఏమీ తెలియని వాడిలా ఆట పట్టించాను. నే నిప్పుడు నీ ఇంటి దగ్గరనుండే వస్తున్నాను. స్వర్ణ పేరుకే కాదు, ఆ పిల్ల మనస్సు కూడా స్వర్ణమే. ఇందుకే ఆ పిల్లను నా కోడలుగా చేసుకుంటాను. ఇది తిరుగులేని నిర్ణయం. మరో మాట. శ్రీనూ! మనిషిలో ఆశ చావకూడదు. అయితే, ఈ ఆశ దురాశ కాకుండా చూసుకోవాలి. అంతే" అంటూన్న మిత్రుడిని గట్టిగా కౌగిలించుకున్నారు శ్రీనివాస రావుగారు. *

హృదయ పూర్వక దీపావళి శుభాకాంక్షలు

చెవుడు

దయచేసి మా స్పెషలిస్టును సంప్రదించి ఉచిత ప్రదర్శన పొంది మీ చెవుడికి సరిపడే వినికిడి సాధనకై సలహా పొందండి. వారు ఆడియోమీటరుతో మీ చెవులను పరీక్షించి మా దగ్గర గల DANAVOX - DENMARK శ్రవణ యంత్రములలో గల అనేక రకములలో మీకు తగినది నిర్ణయిస్తారు. ఇతరులకు కనిపించకుండ ధరించగల శ్రవణ యంత్రములు కూడా మా వద్ద కలవు. మీరు దానిని కొనవచ్చును, లేదా ఆర్డరు ఈయవచ్చును. మీ వినికిడి సాధనాలకు మరమ్మతు చేసి వెంటనే ఇవ్వగలము. పాత వినికిడి సాధనాలను కొత్త వాటితో మార్చుకొనవచ్చును. ఈ క్రింది చోట్ల వారిని కలవండి:—

| | | |
|---|---|---|
| 1. విశాఖపట్టణము | హోటల్ ఫ్లూటి, డాబా గార్డెన్స్ | ప్రతి నెల 15 వ తారీఖున |
| 2. కాకినాడ | ద్వారకా లాడ్జి, రాజా రామ్మోహన్‌రాయ్ రోడ్డు | ప్రతి నెల 16 వ తారీఖున |
| 3. రాజమండ్రి | హోటల్ పంచవటి, మునిసిపల్ పార్క్ ఎదురుగా | ప్రతి నెల 17 వ తారీఖున |
| 4. [illegible] | హోటల్ మధుమతి, మైన్ రోడ్డు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నము 2 గంటల వరకు | ప్రతి నెల 18 వ తారీఖున |
| 5. విజయవాడ | వెల్‌కమ్ హోటల్, గాంధీనగర్ | ప్రతి నెల 19 వ తారీఖున |
| 6. గుంటూరు | ఉడిపి శ్రీకృష్ణభవన్, రైల్వే స్టేషన్ రోడ్డు | ప్రతి నెల 20 వ తారీఖున |

దీనిని ఇంటిమేషన్‌గా భావించి మీ అవసరాల నిమిత్తం మమ్ము సంప్రదించ గోరెదము. సంప్రదించు వేళలు: ఉదయం 9—00 నుండి సాయంత్రము 6—00 గంటల వరకు. అన్ని స్థలములలో ప్రతి రోజు

నియో మోడరన్ రేడియో
అండ్ ఎలెక్ట్రానిక్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారిచే ఆమోదించబడినది.

లక్ష్మీనరసు మాన్షన్, 95, పార్క్‌లేన్, సికింద్రాబాద్-3.

ఫోన్: 76700

MAP